క్లుప్తంగా

దాతల సహకారం అభినందనీయం


దాత పెదవెంకటరత్నాన్ని సత్కరిస్తున్న గ్రామస్తులు, ఉపాధ్యాయులు

కాళ్ల: పాఠశాల అభివృద్ధికి దాతలు చేస్తున్న సహకారం అభినందనీయమని మాజీ సర్పంచ్ కట్రెడ్డి శ్రీనివాసరావు అన్నారు. కాళ్ల మండలం సీసలి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మంగళవారం విద్యార్థుల దాహార్తిని తీర్చేందుకు గ్రామానికి చెందిన రిటైర్డ్ తహసీల్దార్ గణేశ్న పెదవెంకటరత్నం రూ.1.20 లక్షల విలువైన వాటర్ కూలర్‌ను అందించారు. ఈ సందర్భంగా ఆయనను గ్రామ పెద్దలు పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గణేశ్న పద్మారావు, సూర్యనారాయణ, నల్ల శ్రీను, నూకల భోగేంద్రబాబు, ప్రధానోపాధ్యాయురాలు జీవీ పద్మకుమారి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి, అమ్మవార్లు

భీమవరం(ప్రకాశంచౌక్): జువ్వలపాలెం రోడ్డులో వేంచేసియున్న శ్రీపద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో చైత్రమాసంలో చివరి మంగళవారం పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. శ్రీవారికి అష్టదళ పాద పద్మారాధన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

పీహెచ్‌సీని పరిశీలించిన జిల్లా వైద్యాధికారి


ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా వైద్యాధికారి డాక్టర్ గీతాబాయి

పాలకోడేరు: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ గీతాబాయి మంగళవారం ఆకస్మికంగా పరిశీలించారు. ఫార్మసీ, లేబరేటరీ, డెలివరీ రూమ్‌లను పరిశీలించి పరిశుభ్రంగా ఉంచడంతో సంతృప్తి వ్యక్తం చేసి సిబ్బందిని అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హాస్పిటల్‌కు వచ్చిన రోగులతో మర్యాదగా నడుచుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సీహెచ్‌వీ రంగం నాయుడు, డాక్టర్ లీలాలక్ష్మి, సీహెచ్‌ఓ సత్యనారాయణ, పీహెచ్‌ఎన్ కుమారి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు మేధస్సును పెంచుకోవాలి


విద్యార్థుల సైన్స్ నమూనాలను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ జామి హైమావతి

ఆకివీడు: విద్యార్థులు మేధస్సుకు పెంచుకొని, చదువుతోపాటు నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ ముందుకు వెళ్లాలని నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి పిలుపునిచ్చారు. విద్యా దినోత్సవ సందర్భంగా స్థానిక విజ్ఞాన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో విద్యార్థులు సైన్స్ ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో ప్రతిభను కనబరిచాలన్నారు. కౌన్సిలర్ కట్టా రవి మాట్లాడుతూ అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యాభ్యాసం కొనసాగించినప్పుడే మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. బోళ్ల వెంకట్రావు, కరస్పాండెంట్ సత్యనారాయణ ప్రిన్సిపల్ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భీమవరం: ఒకటో పట్టణంలో బుధవారం మార్కెట్‌లోని ఇండోర్ విద్యుత్ సబ్‌స్టేషన్‌కు బుధవారం మరమ్మతులు చేపట్టనున్నారు. ఈ మేరకు ఈ నెల 23వ తేదీ బుధవారం ఉదయం 7 నుంచి 11 గంటల వరకు ఒకటో పట్టణంలో విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్‌శాఖ ఈఈ ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు. మెంటేవారి తోట, బుధవారం మార్కెట్, కొత్త బస్టాండ్ ఏరియా, కళాభవన్ వీధి, శ్రీనివాస సెంటర్, ముస్లిం వీధి, రైతుబజార్ ఏరియా, రైల్వే జంక్షన్ రోడ్, సీఎంఆర్ ఏరియా, రిలయన్స్ సూపర్ మార్కెట్ ఏరియా, వీరమ్మపార్క్ ఏరియా పెద్దమసీదు సెంటర్, భీమనాథం వీధి, పోలీసు బొమ్మ సెంటర్, ఏరియాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు. వినియోగదారులు సహకరించాలని విద్యుత్ ఈఈ వెంకటేశ్వరరావు కోరారు.

లింక్ రోడ్డు నిర్మాణంతోనే గ్రామాభివృద్ధి

- ఉండి, అర్తమూరు లింక్ రోడ్డు నిర్మించాలని ప్రజల వినతులు
- వెనుకబడిపోతున్న గ్రామానికి రోడ్డుతోనే ప్రయోజనం


ఉండి, అర్తమూరుకు మధ్యలో నిర్మాణం చేపట్టాలంటున్న లింక్ రోడ్డు ఇదే

ఉండి: అర్తమూరు మండల శివారు గ్రామం. ఈ గ్రామం అభివృద్ధికి మాత్రం ఆమడ దూరంలో ఉంది. ముఖ్యంగా మండల కేంద్రం ఉండికి రావాలంటే సుమారుగా 7 కిలో మీటర్లు ప్రయాణించాల్సిందే. అయితే లింకు రోడ్డు నిర్మాణంతో ఆ దూరం 1.5 కిలో మీటర్లకు తగ్గిపోవడంతో పాటు అన్నింటిలో అభివృద్ధి అందుబాటులోకి వస్తుంది. అలా జరగాలంటే ఒకటే మార్గం ఉండి శివారు ఉప్పుగుంట, అర్తమూరు రహదారి నిర్మాణం చేపట్టాలి.

నియోజకవర్గ కేంద్రం ఉండి శివారు ప్రాంతం ఉప్పుగుంట వరకు ఆర్‌అండ్‌బీ రహదారి ఉంది. అక్కడి నుంచి అర్తమూరుకు వెళ్లాలంటే సుమారుగా 1.5 కిలో మీటర్ల మాత్రమే ఉంటుంది. ఈ రెండు గ్రామాలను అతిసులభంగా కలుపగలిగేది లింక్ రోడ్డు. ఈ లింక్ రోడ్డు నిర్మాణం చేపట్టాలంటూ ప్రజలు ఏళ్ల తరబడి ప్రభుత్వాలను అడుగుతూనే ఉన్నారు. ఇది మా పరిధి కాదంటూ ఒకరిపై ఒకరు నెట్టుకుంటూ అధికారులు కాలయాపన చేశారు. ఇప్పుడు స్థానికులు రోడ్డు నిర్మాణం చేపట్టాలంటూ తమ విన్నపాన్ని మరోసారి వినిపిస్తున్నారు. అభివృద్ధికి ఆమడదూరంలో నిలిచిన అర్తమూరుకు ఈ రోడ్డు నిర్మాణం జరిగితే విద్య, వైద్యం మరింత చేరువ అవుతాయని స్థానికులు చెబుతున్నారు. అటు రైతులకు, ఇటు ప్రజలకు ఈ లింక్ రోడ్డు నిర్మాణం చాలా ప్రయోజనకరంగా ఉంటుందని వారంటున్నారు.

లింక్ రోడ్డుతో ముడిపడిన అభివృద్ధి

కేవలం 1.5 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణం చేపడితే శివారు గ్రామంలోని విద్యార్థులు హైస్కూల్, జూనియర్ కళాశాలకు వచ్చేందుకు వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. అర్తమూరులో ప్రాథమిక పాఠశాల స్థాయి వరకే విద్యా బోధన చేస్తున్నారు. అక్కడి నుంచి సుమారు 3 కిలో మీటర్ల దూరంలో ఉన్న చెరుకువాడకు హైస్కూల్‌లో చదవాల్సిందే. ఆపై చదువులు చదవాలంటే మాత్రం భీమవరం, ఆకివీడు పట్టణాలకు వెళ్లాల్సిందే. అదే రోడ్డు నిర్మాణం జరిగితే ఉండిలోని జెడ్పీ హైస్కూల్‌లో ఇంటర్ వరకు చదివేందుకు విద్యార్థులకు మరింత అనుకూలంగా ఉంటుంది. భీమవరం, ఆకివీడు పట్టణాలకు వెళ్లేందుకు చాలా మంది వెనుకాడటంతో వారి చదువులు పదో తరగతితోనే ఆగిపోతున్నాయి. అర్తమూరు శివారు ప్రాంతం కవిటంపాకల ప్రజలకు వైద్యంఅందాలంటే మాత్రం చాలా ఇబ్బందే. సమీపంలోని చెరుకువాడలో పీహెచ్‌సీ లేదు. గర్భిణుల పరిస్థితి అయితే మరింత దారుణంగా ఉంటుంది. అయితే ఉండికి లేదా ఆకివీడుకు వెళ్లాల్సిందే.

మా గ్రామాభివృద్ధి వారి చేతుల్లోనే



మాది మండల శివారు గ్రామం కావడంతో అభివృద్ధిలో వెనుకబడి ఉన్నాం. మౌలిక వసతులు పంచాయతీ ద్వారా అందుతున్నా సంస్కృతీ సంప్రదాయాలకు చాలా వెనుకబడి ఉన్నాం. మండల కేంద్రంతో మమ్మల్ని అనుసంధానం చేసేందుకు రోడ్డు నిర్మాణం చేపట్టండి. ఈ పని ప్రజా ప్రతినిధులు, అధికారుల చేతుల్లోనే ఉంది. కనుక మా అభివృద్ధి కూడా వారి చేతుల్లోనే ఉంది.

– జొన్నల వజ్రం, అర్తమూరు

విద్యార్థులకు భారంగా ఉంటుంది



పోటీతత్వంతో విద్యార్థులు ఎంతో గొప్పగా చదవుకుంటున్న ఈ రోజుల్లో అర్తమూరు గ్రామం ఉన్నత విద్యకు దూరం అవుతుంది. కనీసం ఇంటర్ వరకైనా చదువుకోవాలంటే భీమవరం, ఆకివీడు వెళ్లాలి. అయితే ఉండిలోని జూనియర్ కాలేజీకి వెళ్లేందుకు ఈ లింక్ రోడ్డు మాకు చాలా దగ్గరగా ఉంటుంది. సాధారణంగా వెళ్లాలంటే 7 నుంచి 8 కిలో మీటర్లు ప్రయాణించాలి.

– గోనబోయిన రామదాసు, వైఎస్సార్‌సీపీ గ్రామాధ్యక్షుడు, అర్తమూరు

వైద్యం అందుబాటులోకి వస్తుంది



రోడ్డు నిర్మాణం మాకు చాలా అవసరం. వైద్యపరంగా మేమెంతో ఇబ్బంది ఎదుర్కొంటున్నాం. మండల ఆరోగ్య కేంద్రం మాకు చాలా దూరంలో ఉంది. గర్భిణులు, బాలింతలు ప్రైవేట్ అసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తుంది. దూరం తగ్గేలా రోడ్డు నిర్మిస్తే ఉండి పీహెచ్‌సీ మాకు చాలా దగ్గరగా ఉంటుంది.

– పోతుల ఆదాము, అర్తమూరు

గడ్డి వాముల దగ్ధం

ఉండి: మండలంలోని చెరుకువాడలో మంగళవారం రెండు గడ్డివాములు దగ్ధమయ్యాయి. ఆకివీడు అగ్నిమాపక అధికారి నాగేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలోని కోట వీరాంజనేయులు, కోట వెంకటేశ్వరరావులకు చెందిన 1.5 ఎకరాల చొప్పున రెండు గడ్డివాములు దగ్ధం అయ్యాయి. ఆకివీడు ఫైర్ సిబ్బందికి అందిన సమాచారం మేరకు ఫైర్ ఆఫీసర్ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సిబ్బంది హుటాహుటీన ప్రమాద స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు పొగతాగి నిర్లక్ష్యంగా పారవేయడంతో అగ్ని ప్రమాదం సంభవించి ఉంటుందని ప్రాథమిక అంచనా వేసినట్లు అధికారులు తెలిపారు. రెండు గడ్డి వాములు కలిపి రూ.60 వేల నష్టం వాటిల్లినట్లు ఫైర్ అధికారులు అంచనా వేశారు.

టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

భీమవరం: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎస్సీ కార్పొరేషన్, నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ ద్వారా సెల్ఫ్ ఎంప్లాయిడ్ టైలర్స్ కోర్సులో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.వసంతరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని అల్లూరి సీతారామరాజు భగత్‌సింగ్ విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 29 నుంచి రెండు నెలల పాటు నిర్వహించే శిక్షణకు ఎస్ఎస్‌సీ విద్యార్హత కలిగిన 18 నుంచి 45 ఏళ్ల వయస్సు గలవారు అర్హులన్నారు. ఉచిత శిక్షణతోపాటు భోజన సదుపాయం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. శిక్షణ పొందిన వారికి ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాలు ఇప్పిస్తామన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఆధార్, రేషన్‌కార్డు, ఎస్ఎస్‌సీ సర్టిఫికెట్ జిరాక్స్, మూడు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 91105 77977, 95731 74095, 98482 6647 నంబర్లలో సంప్రదించాలని వసంతరావు తెలిపారు.

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి


సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం(ప్రకాశంచౌక్): ప్రతి ఒక్కరూ పట్టణ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి కోరారు. మంగళవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, భీమవరం సుందరీకరణ, మౌలిక వసతుల అభివృద్ధిలో భాగంగా చేపట్టిన పనుల పురోగతి, ఇంకా చేపట్టవలసిన పనులపై మున్సిపల్ అధికారులు, దాతలతో సమీక్షించారు. వీటిలో ప్రధానంగా కాస్మో క్లబ్ వద్ద వంశీకృష్ణ పార్కు, ఏఎస్ఆర్ నగర్ పార్కు, అడ్డవంతెన దగ్గర నుంచి మున్సిపల్ లిమిట్స్ వరకు డివైడర్ అభివృద్ధి పనులు, ఆదర్శనగర్ పార్కు, ఆదిత్య కళావేదిక పార్కు, ఓల్డ్ బస్టాండ్, భీమవరం హాస్పిటల్ వద్ద మోడ్రన్ బస్సు షెల్టర్లు, అంబేద్కర్ సర్కిల్ ఆర్.యు.బి కుడివైపు ఖాళీస్థలం అభివృద్ధి పనులు, తదితర పనులను సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ పట్టణ వాసులకు ఆహ్లాదకరమైన, ఆరోగ్యవంతమైన మౌలిక వసతుల ఏర్పాటు దిశగా చర్యలు చేపడుతున్నామన్నారు. సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి, ఆర్డీవో కె.ప్రవీణ్ కుమార్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, తహసీల్దార్ రావి రాంబాబు, జిల్లా గ్రంథాల అధికారి ఎస్.వెంకటేశ్వరరావు, ఆర్టీసీ ఆర్ఎం, డిపో మేనేజర్, మున్సిపల్ ఇంజనీర్ త్రినాథరావు, డీఈలు, ఏటీపీ, దాతలు సామంతపూడి శ్రీరామరాజు, సీహెచ్ కృష్ణంరాజు, గాదిరాజు సుబ్బరాజు, విష్ణు కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ వాసు, రమేష్‌రాజు, కాస్మో క్లబ్ సెక్రటరీ రామరాజు, కంతేటి రామరాజు, చెరుకువాడ రంగసాయి, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం అమ్మకాల్లో రైతుల అగచాట్లు


తన బాధను చెబుతున్న రైతు వెంకటేశ్వరరావు

కాళ్ల: ఆరుగాలం కష్టపడి పంట పండించిన వరి రైతు పరిస్థితి రోజురోజుకు దిగజారిపోతుంది. రైతులు పండించిన ధాన్యం అమ్ముకోవాలన్నా ఇబ్బందిగానే ఉందని తక్కువ ధరకు ఎలా అమ్మగలమని కాళ్ల మండలం సీసలికి చెందిన రైతు వెంకటేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. 1293 రకం వరి సాగు చేస్తే ఇది కామన్ రకంలోకి పెట్టారని, మాయిశ్చర్ పేరుతో రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీని వలన సుమారు క్వింటాల్‌కు రూ.30 రైతుకు నష్టం వస్తుందని వాపోయారు. ఇలా అయితే కొన్నాళ్లకు వ్యవసాయం చేసే రైతే ఉండడన్నారు. సంచులు మంచివి ఇవ్వట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పురుగు మందులు కొనాలంటే జీఎస్టీ అడుగుతున్నారని వరి రైతు పరిస్థితి చాలా దయనీయంగా ఉందని వాపోయారు. ఎరువుల ధరలు బాగా పెరిగాయని బస్తా ధర రూ.1800 తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ విధంగా రైతు పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే పరిస్థితి కొనసాగితే రానున్న రోజుల్లో వ్యవసాయం చేసేందుకు రైతులు ఎవరూ ఉండరని చెప్పారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ధాన్యం కొనుగోలు చేసి, రైతులను ఆదుకోవాలని కోరారు.

విద్యార్థులను ప్రభుత్వ బడిలో చేర్పించాలి


హైస్కూల్లో గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న ప్రధానోపాధ్యాయులు

భీమవరం అర్బన్: తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ సుంకర పరమేశ్వరరావు అన్నారు. మండలంలోని అనాకోడేరు గ్రామంలో డీఎన్నార్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుంకర పరమేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉంటారన్నారు. అంతేకాకుండా మధ్యాహ్న భోజన వసతి, స్కూల్ యూనిఫామ్‌లు, ఉచిత బుక్స్ ఇలా ఎన్నో సౌకర్యాలు కలిస్తున్నదన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు రేపాక వెంకన్నబాబు, రిటైర్డ్ హెచ్‌ఎం బొండా వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు జి.నర్మద, ఎస్.దుర్గా వరప్రసాద్, ఎంవీ శ్రీలక్ష్మి, డి.అనురాధ, కె.రాజేష్ కుమార్‌రాజు, జీఎస్ విజయలక్ష్మి, సీహెచ్ శ్రీనివాస్, ఎస్.ప్రేమరాజు, తదితరులు పాల్గొన్నారు.

24న కలెక్టరేట్‌లో ధర్నా

ఆకివీడు: ఈ నెల 24న కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు భవన నిర్మాణ కార్మికుల సంఘ నాయకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేయనున్నట్లు మండల కమిటీ అధ్యక్షుడు కేశిరెడ్డి వెంకట ధనరాజు, ఉపాధ్యక్షుడు నంగిగడ్డ కొండ, కార్యదర్శి మనోహర్, కోశాధికారి నూకల సత్యనారాయణ తెలిపారు. ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు తాపీ మేస్త్రీలు, భవన నిర్మాణ కార్మికులు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు.

బ్లడ్ క్యాన్సర్ బాధిత బాలుడికి ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే అంజిబాబు

భీమవరం: ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం మానవత్వమని, బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న మూడేళ్ల బాబుకు సహకారం అందించడానికి దాతలు ముందుకు రావడం అభినందనీయమని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న మూడేళ్ల బాలుడికి పట్టణానికి చెందిన దాతలు రూ.లక్ష ఆర్థిక సాయం ఎమ్మెల్యే అంజిబాబు చేతుల మీదుగా అందించారు. భీమవరం 27వ వార్డుకు చెందిన కాసారపు దుర్గాప్రసాద్ మూడేళ్ల కుమారుడు వేహాంత్ అర్జున్ బ్లడ్ క్యాన్సర్‌తో విజయవాడ రెయిన్‌బో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. భీమవరానికి చెందిన రాజ్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు గంటా రాజ్‌కుమార్ రూ.50 వేలు, డీఎన్నార్ ఇంజనీరింగ్ కళాశాల సీఎస్ఈ ఫైనల్ ఇయర్ విద్యార్థులు జి.పాల్‌రోనాల్డ్, జి.దీపక్, ఇ.సంజయ్‌బాబు, జె.ఆంజనేయ ప్రసాద్, బి.ఫణీంద్ర కలిసి రూ.50 వేలు అందించారు. బ్యాంక్ బాబీ, పాలపర్తి సాగర్, లంకి చిన్ని పాల్గొన్నారు.

పిల్లలకు పౌష్టికాహారం అందించాలి


భీమవరం: అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహిస్తున్న సిబ్బంది


కాళ్ల: ఏలూరుపాడు అంగన్‌వాడీ కేంద్రంలో ప్రదర్శన చేస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

భీమవరం: పిల్లలకు చిన్న తనంలో పౌష్టికాహారం అందించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.సరళ అన్నారు. మంగళవారం భీమవరం అర్బన్ సెక్టార్ పరిధిలోని బందరు పుంత అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడా ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఆరోగ్యకరమైన ఆహారం, సెల్‌ఫోన్లకు పిల్లలను దూరంగా ఉంచడం, ఊబకాయం వంటి అంశాలపై వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త మేరీ గ్రేస్, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో మంచి భవిష్యత్

ఉండి: పౌష్టికాహార లోపం జీవితకాలం ఇబ్బందికరంగా మారుతుంది. కావున భవిష్యత్‌లో ఎటువంటి అనారోగ్య సమస్యలు రాకుండా ఉండాలంటే పౌష్టికాహారం తీసుకోవడం తప్పనిసరని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.సూర్యకుమారి అన్నారు. మంగళవారం మండలంలోని ఉణుదుర్రులో పోషణ్ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా ఐసీడీఎస్ సిబ్బంది స్థానికులు సహకారంతో పోషకాహారంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యకుమారి మాట్లాడుతూ పౌష్టికాహార లోపం ఎక్కడా తలెత్తకూడదనే ఉద్దేశ్యంతోనే ప్రభుత్వం అంగన్‌వాడీల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం ఉచితంగా అందజేస్తుందన్నారు. బాలామృతం పేరుకు తగ్గట్టే అమృతమని దానిని తప్పకుండా పలు రకాలుగా తీసుకోవచ్చని తెలిపారు. బాలామృతంతో బిస్కెట్లు, లడ్డూలు చేసుకుని తింటే మరింత బాగుంటుందని సూచించారు. కార్యక్రమంలో స్థానిక స్కూల్ హెచ్‌ఎం కృపరేఖ,అంగన్వాడీ వర్కర్స్ పాల్గొన్నారు.


ఉండి: ఉణుదుర్రులో పౌష్టికాహార ఆవశ్యకతపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

పోషణ్ పక్వాడా పక్షోత్సవాలు

కాళ్ల: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడ పక్షోత్సవాలు ఈ నెల 8వ తేదీ నుంచి 22 వరకు నిర్వహిస్తున్నామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సీహెచ్ హేమలత, వి.నిర్మల తెలిపారు. కాళ్ల మండలం ఏలూరుపాడులో ఐసీడీఎస్ ఆకివీడు ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో మంగళవారం పోషణ్ పక్వాడ పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, పిల్లలు తీసుకోవలసిన పోషకాల గురించి, ఆకుకూరల ప్రాముఖ్యత గురించి వివరించారు. అనంతరం ఎనిమియా, ముక్తీ భారత్, శక్తి యాప్‌ల గురించి వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, గర్భిణులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి కల్యాణ మహోత్సవం


స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భీమవరం(ప్రకాశంచౌక్): గోవింద నామస్మరణతో శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానం మారుమోగింది. స్థానిక హౌసింగ్ బోర్డ్ కాలనీ శ్రీపద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం రాత్రి స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని వేద మంత్రాలతో నిర్వహించారు. కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ సతీమణి దేవి, ఎమ్మెల్యే అంజిబాబు సతీమణి సత్యవాణి పట్టు వస్త్రాలను అందించారు. ఆలయ అధ్యక్షుడు కంతేటి వెంకటరాజు, కార్యదర్శి కుక్కల బాల, సరిపడకల రామారావు, జానపాటి మధు, పెన్నడ శ్రీను, కడలి వెంకటేశ్వరరావు, అల్లు రామారావు, కడలి ఫణి కుమార్, ఏడిద త్రిమూర్తులు పాల్గొన్నారు.

యువత చెడు మార్గంలో వెళ్లొద్దు

భీమవరం: టుటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో సంచార జీవనం సాగిస్తున్న వారికి టుటౌన్ సీఐ జి.కాళీచరణ్ మంగళవారం కౌన్సెలింగ్ ఇచ్చారు. గరగపర్రు రోడ్డులోని డీమార్ట్ వెనుక స్లమ్ ఏరియాలో గుడారాలు వేసుకుని బిక్షాటన, కాగితాలు, ప్లాస్టిక్ ఏరుకుని జీవనం సాగించే వారి వద్దకు వెళ్లి యువత చెడు మార్గంలో వెళ్లొద్దని వారికి హితవు పలికారు. ప్రధానంగా యువతను వారి తల్లిదండ్రులు నిత్యం గమనిస్తూ దుర అలవాట్లకు దూరంగా ఉండే విధంగా క్రమశిక్షణ కలిగే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.

నేడు రాములోరి విగ్రహ ప్రతిష్ఠ

ఆకివీడు: స్థానిక ఎస్‌టర్నింగ్ వద్ద నూతనంగా నిర్మించిన కోదండ రామాలయంలో మంగళవారం రాములోరి విగ్రహాలకు క్షీరాధి, జలాధి, ధాన్యాధి వాసం నిర్వహించారు. ఆలయ నిర్మాణ కర్తలు స్వర్గీయ అన్నం భోగయ్య గుప్త కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో బుధవారం ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యాక్రమం నిర్వహించనున్నారు.

దళితుల సాంఘిక బహిష్కరణ ఉగ్రవాద చర్య


సమావేశంలో మాట్లాడుతున్న సుందరకుమార్

భీమవరం: కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గంలోని మల్లాం గ్రామంలో దళిత కుటుంబాలను సాంఘిక బహిష్కరణ చేయడం ఉగ్రవాద చర్యని దళితులను సాంఘిక బహిష్కరణ చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని దళిత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందరకుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం భీమవరం 11వ వార్డులో నిర్వహించిన దళిత ఐక్య వేదిక సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశానికి స్వాతంత్రం వచ్చి 78 ఏళ్ల కావస్తున్నా సమాజంలో దళితులపై చిన్నచూపు చూడడం, కుల బహిష్కరణలు వంటివి సిగ్గు చేటన్నారు. దళితుల బహిష్కరణకు ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ బాధ్యత వహించాలని సుందరకుమార్ డిమాండ్ చేశారు. సమావేశంలో పట్టెం శుభాకర్, పాలపర్తి సాగర్, సాదె మహేష్, కర్రా కల్యాణ్ పాల్గొన్నారు.

భూ పరిరక్షణ అందరి బాధ్యత

ఆకివీడు: భూ పరిరక్షణ మన అందరి బాధ్యత అని ఎస్సై హనుమంతు నాగరాజు అన్నారు. మండలంలోని అజ్జమూరు గరువులోని ఎంపీపీ పాఠశాలలో ధరిత్రి దినోత్సవం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కలు నాటి, పాలిథిన్ వాడకాన్ని నిషేధించాలని పిలుపునిచ్చారు. పచ్చని చెట్లు ఆరోగ్యానికి మెట్లు అంటూ విద్యార్థులు నినాదాలు చేశారు. అనంతరం ఎస్సై నాగరాజు మాట్లాడుతూ పంచభూతాల్లో అగ్ని తప్ప అన్నీ కలుషితమైపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాలుష్యానికి కారణం మనమేనన్నారు. చెట్లు పెంచకుండా నరికి వేయడం వలన వాతావరణ కాలుష్యం ఏర్పడుతుందన్నారు. పాలిథిన్ వాడకం వలన భూమి కలుషితమైపోతుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఆర్‌వీఎస్ నారాయణ (విక్రమ్), కానిస్టేబుల్ సురేష్, రాణి, పూర్ణచంద్రరావు, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్‌పర్సన్ మజ్జి రాజేశ్వరి, ఉపాధ్యాయురాలు ఎన్‌వీ కల్యాణి, తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి


డీటీ నాగార్జునకు వినతిపత్రం అందిస్తున్న నేతలు

భీమవరం: హౌస్ ఫర్ ఆల్ అంటూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని ఎప్పటి నుంచి అమలు చేస్తారో స్పష్టం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇళ్ల స్థలాల హామీని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం డీటీ నాగార్జునకు వినతిపత్రం అందజేశారు. చెల్లబోయిన రంగారావు, ఎం.సీతారామ్ ప్రసాద్ పాల్గొన్నారు.

లెనిన్‌కు ఘన నివాళి

సోషలిస్టు, విప్లవకారుడు లెనిన్ 155వ జయంతి సందర్భంగా మంగళవారం సీపీఐ జిల్లా కార్యాలయంలో లెనిన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి వెండి సమర్పణ

భీమవరం(ప్రకాశంచౌక్): స్థానిక మెంటేవారి తోటలోని శ్రీవిజయ కనకదుర్గ శ్రీచక్ర సహిత బాలాత్రిపుర సుందరి అమ్మవారి వెండి పీఠానికి దాతలు విరాళాలు అందిస్తున్నారు. మంగళవారం పట్టణానికి చెందిన కోళ్ల విజయ్ కుమార్, సుకన్య దంపతులు 105 గ్రాముల వెండిని విరాళంగా ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులకు అందజేశారు. ఆలయ అర్చకులు పూజలు చేసి దాతలకు అమ్మవారి చిత్రపటాన్ని అందించారు. అమ్మవారి వెండి పీటానికి దాతలు ముందుకు వచ్చిన విరాళాలు అందిస్తున్నారని కమిటీ సభ్యులు తెలిపారు.